క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శెంకేశి మల్లికార్జున్ తెలిపారు. బెస్తం చెరువు, రాంగోపాల్‌పూర్, నక్కలపల్లి ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు పోచమ్మమైదాన్, కల్యాణి నగర్, టీచర్స్ కాలనీ, ఏకశిల నగర్, నవయుగ కాలనీ, గణేష్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గణపతి సచ్చిదానంద స్వామి జన్మదిన వేడుక

హన్మకొండ కల్చరల్: వరంగల్ ములుగురోడ్డులోని వరద దత్తాక్షేత్రంలో జగద్గురువు గణపతి సచ్చిదానంద స్వామి జన్మదిన వేడుకను సోమవారం నిర్వహించారు. అర్చకుడు రాపాక గోపి కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సామూహిక భగవద్గీత పారాయణం చేశారు. అనంతరం హనుమకొండలోని ప్రభుత్వ మహిళా ప్రసూతి ఆస్పత్రిలో అన్నప్రసాదాల వితరణ చేశారు. ఆస్పత్రి ఆర్ఎంఓ సారంగపాణి ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వైవీ.వామన్‌రావు, శివరామకృష్ణ ప్రసాద్, తోట శివకుమార్, నిమ్మల యుగంధర్, శ్రీనివాస్, విజేందర్‌రెడ్డి, కుమారస్వామి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో పేదలకు వైద్యం అందించాలి



హన్మకొండ: వైద్యులు వ్యాపార దృష్టితో కాకుండా సేవా దృక్పథంతో పేదలకు వైద్య సేవలు అందించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సూచించారు. హనుమకొండ పద్మాక్షి గుట్ట సమీపంలో స్థాపించిన బందన్ ఆస్పత్రిని వారు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ లక్ష్మణ్, శ్రీవాణి, నవీన్ రెడ్డి, ప్రియదర్శిని రెడ్డి, రమేష్ గౌడ్, జయశ్రీ గౌడ్, త్రినాథ్ గౌడ్, మానగౌడ్, డాక్టర్ మోహన్‌దాస్, డాక్టర్ సాంబశివ రావు, డాక్టర్ పోలా నటరాజ్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఉదయ్ సింగ్, డాక్టర్ తిరుపతి రెడ్డి, డాక్టర్ భీమగాని లక్ష్మీనారాయణ, డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాశిబుగ్గ: రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని పుప్పాలగుట్టకు చెందిన నట్టే బాలరాజు(50) మార్కెట్‌లో గుమస్తాగా పని చేస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

యువకుడిపై పోక్సో కేసు

కాజీపేట: బాలికను ప్రేమపేరుతో వంచించిన ఓ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన రాజారపు ఉమేష్.. తన దగ్గరి బంధువైన ఓ బాలికను బలవంతం చేసి అత్యాచారం చేశాడు. సదరు బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మామునూరు: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి.. క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఖిలా వరంగల్ మండలం అల్లీపురం గ్రామానికి చెందిన పోతుగంటి సోమేశ్వర్ (28) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దాంతో తీవ్ర మనస్తాపంతో శుక్రవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సరస్వతి ఫిర్యాదు మేరకు మామునూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

బైక్ చోరీ

ఖిలా వరంగల్: రాత్రి పూట ఇంటి ముందు నిలిపిఉంచిన బైక్ చోరీకి గురైంది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ రంగశాయిపేటలో పేరాల సందీప్ తన ఇంటి ముందు ఆదివారం రాత్రి బైక్ నిలిపి ఇంట్లో నిద్రించాడు. సోమవారం ఉదయం బైక్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

నగరంలో భక్తి ప్రపత్తులతో బక్రీద్

కాజీపేట: సందేశం ఇస్తున్న మతపెద్ద ఇమామ్ మహబూబ్ రహిమాన్



ఎల్‌బీనగర్ ఈద్గాలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ



పెద్దమ్మగడ్డ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు





ఖిలా వరంగల్: ఈద్గా వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



కాజీపేట రూరల్: దర్గాలో ఖుస్రుపాషా, సిరిసిల్ల రాజయ్య



హసన్‌పర్తిలో నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు



ఎల్‌బీనగర్ ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



ఖిలా వరంగల్: ముస్లింలతో ఏసీపీ నందిరాంనాయక్



హసన్‌పర్తి: ఆలింగనం చేసుకుంటున్న ముస్లింలు

కాజీపేట: సర్వమానవ సమైక్యత, సద్భావన, ప్రపంచానికి శాంతి సందేశం అందించిన ఇబ్రహీం ఖలీలుల్లాహ్ తన కుమారుడు ఇస్మాయిల్‌ను దైవానికి అంకితం చేయడానికి ప్రయత్నించిన పవిత్ర రోజైన బక్రీద్ పర్వదినాన్ని నగరంలోని ముస్లింలు సోమవారం భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మేకలు, గొర్రెలను బలిచ్చి వాటి మాంసాన్ని పేదలకు పంపిణీ చేశారు. ముస్లింలు ఈద్గాలకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. కాజీపేటలో ముస్లిం మతపెద్ద ఇమామ్ మహబూబ్ రహిమాన్ మాట్లాడుతూ సర్వమానవ సమైక్యత, శాంతికోసం ప్రతిఒక్కరూ కలసిమెలసి జీవించాలని సూచించారు.

ఎల్‌బీనగర్‌లో..

వరంగల్: త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగ అని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎల్‌బీనగర్‌లోని ఈద్గా ఘనీ అబ్దుల్ అజీజ్‌ను సోమవారం సందర్శించి ప్రార్థనలు చేస్తున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం, ఈద్గా అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. వరంగల్‌లో హజ్ హౌస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఈద్గా కమిటీ అధ్యక్షుడు ఎండీ.సాదిక్, ప్రధాన కార్యదర్శి ఎండీ.అబ్దుల్లా కోరారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ ఫుర్కాన్ నేతృత్వంలో మంత్రిని సన్మానించారు. నమాజ్ కార్యక్రమంలో ఈద్గా బాధ్యులు సర్వర్ పాషా, డాక్టర్ షేక్‌హుస్సేన్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మగడ్డ ఈద్గాలో..

హన్మకొండ చౌరస్తా: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ పెద్దమ్మగడ్డలోని ఈద్గా హుస్సేన్ ఆలంలో ముస్లింలు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మౌలానా మొహమ్మద్ ఖాజా అహ్మద్ మావినొద్దీన్ నమాజ్ నిర్వహించారు. అయితే, నమాజ్‌కు ముందు దాదాపు గంట పాటు ఈద్గా ప్రాంతంలో విద్యుత్ లేకపోవడంతో ముస్లింలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో ఈద్గా కమిటీ సభ్యులు మహ్మద్ నయీమొద్దీన్, సలీం, ఖలీల్ అహ్మద్, అజీం, మొయిన్, షకీల్, తౌసిఫ్, నవీద్, మహమూద్, మైనారిటీ కమిషన్ సభ్యుడు దర్శన్‌సింగ్, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్ ఈద్గా వద్ద బందోబస్తు

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ ఈద్గా వద్ద ముస్లింలు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. తనిఖీలు చేస్తూ ముస్లింలను ఈద్గాలోకి అనుమతించారు. వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య నేతృత్వంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈమేరకు నగర ప్రజలకు, పోలీసు యంత్రాంగానికి ఖిలా వరంగల్ ఈద్గా ప్రతినిధులు ఎంఏకే తన్వీర్, ఎంఏ జబ్బార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కాజీపేట దర్గాలో..

కాజీపేట రూరల్: కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గాలో బక్రీద్‌ను పురస్కరించుకొని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రుపాషాను తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపి అలయ్‌బలయ్ తీసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 48వ డివిజన్ అధ్యక్షుడు సింగారపు రవిప్రసాద్, మైనార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎండీ.ఇంతియాజ్, సయ్యద్ రజాలీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: బక్రీద్ పర్వదిన వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హసన్‌పర్తితో పాటు భీమారం, వంగపహాడ్, నాగారం, అర్వపల్లి, మునిపల్లి, చింతగట్టు క్యాంపు, సీతంపేట, ఎల్లాపురం గ్రామాల్లోని ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆలింగనం చేసుకున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగపురి కొమురయ్య ఇటీవల మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ 44వ డివిజన్ అధ్యక్షుడు రాజారపు స్వామి ఆధ్వర్యంలో సోమవారం చేయూనందించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశాల మేరకు 75కిలోల బియ్యాన్ని అందజేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యుగంధర్, దయాకర్, మారం ప్రసాద్, గోపాల్ రెడ్డి, భిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
నిరుపేద కుటుంబానికి చేయూత

పేద కుటుంబానికి..

పరకాల: అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మంగళపల్లి శైలజ కుటుంబానికి పరకాల 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి నిత్యావసర వస్తువులను సోమవారం అందజేశారు. మృతురాలికి భర్త మహేశ్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కౌన్సిలర్ 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసరాలు అందజేశాడు.

విద్యా కుసుమానికి సన్మానం



హన్మకొండ చౌరస్తా: పదవ తరగతిలో 10 జీపీఏ సాధించిన మడుపోజు భువనకృతిని హనుమకొండ జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్పెంటర్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సన్మానించారు. అలంకార్ జంక్షన్‌లోని టీఎన్జీఓఎస్ భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో భువనకృతికి రూ.15వేల నగదు, ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్పెంటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అలుగోజు కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సన్మానసభలో విశ్వకర్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విశ్వబ్రాహ్మణ విద్యా కసుమం భువనకృతి అని కొనియాడారు. ప్రతిభావంతులైన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ఉన్నత విద్యా కోసం అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని అన్నారు. కార్యక్రమంలో వీణవంక సదానందం, రామోజు నాగసోమేశ్వరా చారి, రాళ్లబండి వీరాచారి, వేమునూరి సోమేశ్వర్, కత్రోజు లింగాచారి, సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీ కడియం కావ్యను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

హన్మకొండ అర్బన్: కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం సమస్య, ఉద్యోగుల ఇన్‌కం ట్యాక్స్ పరిధి పెంపుదల డిమాండ్ పరిష్కారానికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్యను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ కోరారు. ఎంపీ కావ్యను ఆమె స్వగృహంలో పలువురు నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేసి సన్మానించారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘ నాయకులు శ్యామ్‌సుందర్, లక్ష్మీప్రసాద్, ములుగు జిల్లా అధ్యక్షుడు పోలు రాజు, హనుమకొండ జిల్లా నాయకులు రాజ్యలక్ష్మి, జయంతి, మాధవి, రాజమౌళి, బింగి సురేష్, రామ్‌ప్రసాద్, రాజేష్ ఖన్నా, గౌతం, రామాంజనేయులు, అనూప్, ప్రణయ్, పృథ్వీ, సుధాకర్, శ్రీనివాస్, శివ, సాయి పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై రామకోటి స్తూపానికి ప్రత్యేక అర్చనలు



మడికొండ: ఏకాదశి సందర్భంగా మెట్టుగుట్టపై ఉన్న రామకోటి స్తూపానికి సోమవారం ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రామకోటి పుస్తకాలను అందులో నిక్షిప్తం చేశారు. కార్యక్రమంలో అర్చకులు విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణ శర్మ, కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, ధర్మకర్తలు బైరి రాజు, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, ఆలయ సిబ్బంది, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోతుల పట్టివేత



ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్‌లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి తినబండారాలు, నిత్యావసర సరుకులను చిందర వందర చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రజల అభ్యర్థన మేరకు కార్పొరేటర్ మరుపల్లి రవి స్పందించారు. కరీమాబాద్‌లోని పలు కాలనీల్లో బల్దియా సిబ్బంది ప్రత్యేక బోన్లు ఏర్పాటు చేసి సుమారు 70 కోతులను సోమవారం పట్టుకున్నారు. ఆ కోతులను అటవీ ప్రాంతానికి తరలించారు. అయితే, పలు కాలనీల్లో ఇంకా చాలా కోతులు ఉన్నాయని, ఈక్రమంలో చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు వెళ్లనీయొద్దని తల్లిదండ్రులకు రవి సూచించారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకూ దుకాణాలు

- చోరీలకు అవకాశం



కాజీపేటలో అర్ధరాత్రి దాటినా తెరిచి ఉన్న దుకాణాలు

కాజీపేట: రాత్రి 11 గంటలు దాటితే రహదారులకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారాలు బంద్ చేయాలనే పోలీసుల ఆదేశాలు ఎక్కడా అమలు కావడం లేదు. కాజీపేట పట్టణంలో అర్ధరాత్రి దాటినా నిర్భయంగా దుకాణాలు తెరిచే ఉంటున్నాయి. పోలీస్ అధికారులు నిర్దేశించిన సమయంలోగా మూసేయాల్సిన దుకాణాలు అర్ధరాత్రి దాటుతున్నా యథేచ్ఛగా వ్యాపారులు అమ్మకాలు చేస్తున్నారు. వాటి నిర్వహణపై పోలీసులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, ఆర్పీఫ్, జీర్పీ పోలీసుస్టేషన్ల నిబంధనలను తుంగలో తొక్కుతూ దుకాణదారులు నిరాటంకంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు.

దొంగతనాలకు అవకాశం

చిల్లర దొంగలు అర్ధరాత్రి వరకు ఆయా దుకాణాల వద్ద వేచి ఉంటూ తర్వాత తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల పలు కేసుల్లో పట్టుబడిన దొంగలు పోలీసు విచారణలో ఈవిషయం వెల్లడించడమే అందుకు సాక్ష్యం. దొంగలు అర్ధరాత్రి దాకా రోడ్డు పక్కన దుకాణాల వద్ద టిఫిన్లు చేసి ఆ తర్వాత దొంగతనాలకు వెళ్లేవాళ్లమని అంగీకరించారు. రాత్రిదాకా టిఫిన్ సెంటర్ల వద్ద వేచి ఉంటూ చోరీలు చేసి రైళ్లలో పరారీకావడం జరుగుతున్నట్లు పోలీసు అధికారుల విచారణలో విస్మయకర విషయాలు వెలుగు చూశాయి. వాటన్నింటిని పరిగణలోకి తీసుకున్న ఉన్నతాధికారులు రాత్రి 11గంటల తర్వాత తోపుడు బండ్లు, టిఫిన్ దుకాణాలు, పాన్ షాపులు మూసివేయించాలనే ఆదేశాలు జారీ చేశారు. అయితే, కాజీపేట రైల్వే జంక్షన్ కూడలిలో అర్ధరాత్రి దాకా టిఫిన్ హోటళ్లు, టీస్టాళ్లు, జ్యూస్ పాయింట్లు, బ్రెడ్ ఆమ్లెట్ బండ్లు, పాన్‌షాపులు, అక్రమంగా మద్యం దుకాణాలు వ్యాపారాలు సాగిస్తున్నారు. ఎవరినైనా అనుమానంతో ఆపి అడిగితే టిఫిన్ చేయడానికి వచ్చామంటూ తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా పెట్రోలింగ్ చేసే పోలీసులు రోజూ జీపులో వచ్చి హడవుడి చేస్తున్నారే తప్ప దుకాణాలు మూసి వేయించడం లేదు.

కొత్తగా అధికారులు వచ్చినప్పుడే హడావుడి

ఆయా పోలీస్ స్టేషన్లకు కొత్తగా ఎస్సైలు, సీఐలు వచ్చినప్పుడే హడావుడి కనిపిస్తోంది. బలవంతంగా దుకాణాలు మూసివేయిస్తారు. క్రమేణా పరిచయాలు పెరగడంతో షరామామూలే. దుకాణాలు సకాలంలో మూసివేయడం వల్ల అర్ధరాత్రి రోడ్ల మీద అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల్లో దొంగ ఎవరో.. దొర ఎవరో తెలిసే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నగరంలోని పోలీసులు పెట్రోలింగ్‌కు వచ్చినప్పుడు దుకాణాలు మూసివేయడం వాళ్లు అలా వెళ్లగానే.. ఇలా తెరుస్తుంటారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు నిర్ణీత సమయంలో దుకాణాలు మూసివేయించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

‘అక్రమ కేసులకు భయపడేది లేదు’



కేయూ పోలీస్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్వీ నాయకులు

కేయూ క్యాంపస్: కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు భయపడేది లేదని బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ అన్నారు. కాకతీయ కళాతోరణాన్ని తెలంగాణ రాజముద్ర నుంచి తొలగించొద్దని ఈనెల 1న కేయూ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టగా బీఆర్ఎస్వీ నాయకులపై కేయూ పోలీసులు కేసు నమోదు చేసి రెండు రోజుల క్రితం అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ సోమవారం మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా చేసిన నిరసనకు తమపై కేసులు పెట్టడం శోచనీయమని వాపోయారు. సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చేవరకు బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని వెల్లడించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి సంగాని సూర్యకిరణ్, రూరల్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు, రాష్ట్ర నాయకుడు గొల్లపెల్లి వీరస్వామిని అరెస్టు చేయగా వారు సొంత పూచీకత్తుపై విడుదల అయినట్లు పేర్కొన్నారు.

నంది అవార్డు గ్రహీతకు సన్మానం



సత్యంను సన్మానిస్తున్న మెపా నాయకులు

హన్మకొండ: తెలంగాణ సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ నుంచి జాతీయ నంది అవార్డు అందుకున్న తోడేటి సత్యం ముదిరాజ్‌ను టీజీ ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. హనుమకొండలోని టీజీ మెపా కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సత్యంకు టీజీ మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, రాష్ట్ర నాయకులు జ్ఞాపిక అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు నీరటి రాజు, సింగారపు రామకృష్ణ, దండు చిరంజీవి, పాండవుల రాణా ప్రతాప్, ఈశ్వరయ్య, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పొదుపు.. జీవితానికి మలుపు



బీమా సొమ్ము అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి, సభ్యులు

మామునూరు: పొదుపు జీవితానికి మలుపు లాంటిదని కొండపర్తి ప్రతాపరుద్ర పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు మందల సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం తిమ్మాపురం గ్రామంలోని శ్రీరామ పురుషుల పొదుపు సంఘంలో సభ్యులైన నర్రయాకయ్య, కొండోజు మురళిలు మరణించగా వారికి బీమా డబ్బులు వారి నామినీలకు ఒక్కొక్కరికి రూ. 40 వేల చొప్పున ఇద్దరికి రూ. 80 వేలు అందజేశారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సంఘంలో సభ్యులుగా చేరాలని సూచించారు. చిన్నప్పటి నుంచి పొదుపు అలవాటు చేసుకుంటే భవిష్యత్‌లో ఎటువంటి కష్టాలు ఉండవన్నారు. సంఘంలో సభ్యులుగా ఉండి చనిపోతే సాధారణ మరణం కింద రూ.40వేలు, ప్రమాదం జరిగితే రూ.2 లక్షల ఇన్సూరెన్స్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు బండి రాజు, ఉపాధ్యక్షుడు మేకల అనిల్ కుమార్, డైరెక్టర్లు గాదె రమేష్, మేకల సతీష్ కుమార్, బైరి రమేష్, కొత్తపెల్లి ఎల్లయ్య, ముప్ప రాజు, ముప్ప అశోక్, గోపరాజు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



కాజీపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణ కోసం కల్పిస్తున్న 5 రకాల చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి సూచించారు. కాజీపేట పట్టణంలో సఖి కేంద్రం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సును సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల కోసం సఖి సహాయ కేంద్రం 24 గంటల పాటు పని చేస్తోందని వివరించారు. బాధిత మహిళలు, బాలికలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కేసు వర్కర్ హరిత, మహిళా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.